: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 44 | 08-08-2022 | పుటలు : 4

## 'హర్ ఘర్ తిరంగా'ను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**03.08.22 (మీడియాసెల్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాల ప్రకారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణాలు మరియు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను జయప్రదం చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. బుధవారం యూనివర్సిటీ ఈసీ హాల్ లో విశ్వవిద్యాలయ అధికారులతో వీసీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలలో భాగంగా "హర్ ఘర్ తిరంగా"ను నిర్వహించాలని సూచించారు. నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణాలతో పాటు అనుబంధ కళాశాలలు తప్పని సరిగా "హర్ ఘర్ తిరంగా" ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. "హర్ ఘర్ తిరంగా"లో భాగంగా అన్ని కళాశాలలు నిర్వహించాల్సిన కార్యక్రమాల వివరాలను తెలియజేసారు. 10వ తేదిన దేశభక్తి వ్యాస రచన/వచనం/క్విజ్, 11న సాంస్కృతిక/దేశభక్తి పోటీలు, 12న ఫోటోగ్రఫీ పోటీలు, 13న మెగా ర్యాలీ కార్యక్రమం, 14న క్రీడలలో పోటీలు, 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించాలని తెలియజేసారు. అలాగే దేశ భక్తిని ప్రతిబింబించే విధంగా అందరి ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేయాలని అన్నారు. విశ్వవిద్యాలయం నిర్వహించిన ఆయా పోటీలలో విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులను ప్రదానం చేస్తామని తెలియజేసారు. అందరూ దేశభక్తితో కార్యక్రమాలను జయప్రదం చేస్తూ భారతదేశ గౌరవన్ని, ఔనత్యాన్ని భావితరాలను అందించాలని, "హర్ ఘర్ తిరంగా"ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## పింగళి వెంకయ్యకు ఘన నివాళులు



పింగళి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ

**03.08.22 (మీడియాసెల్)** జాతీయ పతాకం అందరికీ స్ఫూర్తినిస్తుందని, జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్యకు వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు నివాళు లర్పించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పింగళి వెంకయ్య 146 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో పాల్గొనడమే కాకుండా భారతదేశానికి పింగళి రూపొందించిన జాతీయ పతాకం అందరికీ స్ఫూర్తినిస్తుందన్నారు. పింగళి వెంకయ్య ఎంతో కృషి చేసి భారతదేశంలోని వివిధ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా, అందరికీ ఆమోదయోగ్యమైన త్రివర్ణ పతాకాన్ని భారతదేశానికి అందించారని కొనియాడారు. పింగళి వెంకయ్య బహుభాషా కోవిదులని, ఆర్మీలోనూ, శాస్త్రవేత్త గానూ దేశానికి ఎన్నో సేవలు అందించారని ప్రశంసించారు. నేటి తరం యువత పింగళి స్ఫూర్తితో దేశానికి సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి సురేష్ వర్మ, ఓ.ఎస్.డి ఆచార్య ఎస్ టేకి, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె. రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డీన్స్ డా.ఎ.మట్టారెడ్డి, డా.పి.విజయనిర్మల, డా.పి.వెంకటేశ్వరరావు, డా.ఎం.గోపాలకృష్ణ, సి.ఈ. ఎస్.లింగరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గిరిజన వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం

### ముఖ్య అతిథిగా నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు



జగన్నాథరావును సన్మానిస్తున్న సెంట్రల్ వర్సిటీ వీసీ

**03.08.22 (మీడియాసెల్)** కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మూడవ ఆవిర్భావ దినోత్సవం విజయనగరంలోని గిరిజన విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగింది. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య తేజస్వి కట్టిమణి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు కలిసి జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ కేంద్రీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమణికి, విద్యార్థులకు మరియు సిబ్బందికి యూనివర్సిటీ మూడవ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తరాంధ్రలో గిరిజన విశ్వవిద్యాలయ స్థాపన ద్వారా గిరిజనులకే కాకుండా వెనుకబడిన తరగతుల ప్రజలకు, బడుగు బలహీనవర్గాల ప్రజలకు, పేద స్థితిలో ఉండి చదువుకోలేని అగ్రవర్ణ పేదలకు ఎంతో మంచి జరిగిందని తెలిపారు. ఈ విశ్వవిద్యాలయ విద్యార్థుల ఉన్నత విద్యలో ప్రతిభ కనపరచి విదేవిదేశాలలో ఉన్నత స్థానాల్లో స్థిరపడాలన్నారు. భవిష్యత్ లో విశ్వవిద్యాలయ అభివృద్ధి, ఔన్నత్యాలకు విద్యార్థులు ప్రతిబింబాలుగా ఉండాలన్నారు. తద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతమంతా మరింత అభివృద్ధి సాధిస్తుందని తెలియజేసారు. వీసీ కట్టిమణి మాట్లాడుతూ గిరిజన విశ్వవిద్యాలయం ఇప్పటికి మూడు వసంతాలు పూర్తి చేసుకుందని ఈ విశ్వవిద్యాలయం గిరిజనుల స్థితిగతులను మెరుగుపరచడానికి మరియు గిరిజనులు పాటించే మంచి ఆచార వ్యవహారాలను సమాజానికి బహిర్గతం చేసి సార్వజనీనం చేయాడానికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ గిరిజన విశ్వవిద్యాలయం ఉత్తరాంధ్ర విద్యార్థుల పాలిట కల్పతరువని వారి విద్యాపరమైన ఆశలను కలలను నిజం చెయ్యడానికి ప్రభుత్వంచే స్థాపించబడినదని చెప్పారు. గిరిజన ప్రాంతంలో విద్యార్థినీ విద్యార్థులకు రాబోయే తరాలకి విద్యనభ్యసించడానికి ఒక మంచి వేదికగా ఉండబోతోందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

# సంపాదకీయం




## క్విట్ ఇండియా!

*భారతదేశస్వాతంత్ర్యసమరం
అజరామరం! ప్రపంచచరిత్రలో మరువలేనిమహత్తర సువర్ణాధ్యాయం!
ఆ సువర్ణానికి సువాసన ఆగస్టు విప్లవం. అది ప్రజావిప్లవం. దృఢదీక్షాశిక్షాసమీక్షణం.
"ఏ దేశచరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం?!"
అన్న మహాకవి నైరాశ్యానికి ఇదొక అపవాదం.
భారతదేశస్వాతంత్ర్యసిద్ధికి అమోఘమైనవజ్రాయుధం- ఆగస్టువిప్లవం.*

*అన్నిమతాలు, కులాలు, వర్గాలు రాజకీయపార్టీలు...." నైకనదీనదాలు అదృశ్యంగా కలిసిపోయిన అంతస్సింధువు!"ఈప్రజా-వెల్లువ.ఇది భిన్నత్వంలో ఏకత్వం!
(ఆ తేదీలో విచిత్రం చూడండి:
8-8 కలిపితే 16.
1942-కలిపితే వచ్చే మొత్తం కూడా పదహారే!)
"అందరిదీ ఒకేమాట!
అందరిదీ ఒకేబాట!"*

*రెండవ ప్రపంచయుద్ధంలో బ్రిటిష్ రాజ్యమైన భారతంపై జపాన్ బాంబులదాడికి సిద్ధ మైంది.తెల్లదొరలకి మన సాయం అవసరమైంది. 1942 మార్చినెలలో 'క్రిప్స్ దొర రాయబారం'..విఫలమైంది. యుద్ధం పూర్తయిన తర్వాత సంపూర్ణస్వరాజ్యం బ్రిటిష్ వారి ప్రతిపాదన.ఈ జిత్తులు మనదగ్గర ఫలించలేదు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ 1942 ఆగస్టు 8 వతేదీన క్విట్ ఇండియా తీర్మానంతో దేశం దేశం కదిలింది.విప్లవాగ్ని రగిలింది.మహాత్ముని నేతృత్వంలో ప్రజారథం దిగ్విజయంగా ఉద్యమాన్ని నడిపింది. తెల్లదొరలు అణచివేత మంత్రం పఠించసాగారు. ఆగస్టు 9 న గాంధీజీ,నెహ్రూజీ, పటేల్,మౌలానాఆజాద్ వంటి
నాయకులు నిర్బంధంలో ఉన్నారు. మౌలానా ఎగరేయవలసిన త్రివర్ణపతాకం ఒక యువతి తెగించి శివాజీపార్క్ లో ఎగరేసింది. ఆ సాహసం పేరే- అరుణా అసఫ్ అలీ! ఆంధ్రదేశంలోప్రకాశం,పట్టాభివంటినేతలంతా అరెస్టయ్యారు. నిరసన! నిరసన!!నిరసన!!! హింసాత్మక - రక్తపంకం- అనివార్యమయ్యాయి. పర్యవసానం చరిత్రపుటల్లో భారతజాతి అద్భుతపోరాటతత్త్వంప్రపంచానికి సుస్పష్టమైంది. దేశమంటేమట్టికాదని..దేశమంటే ప్రజలని సుస్థాపితమైంది.*

"Do or Die!"....."Quit India!"

*అనే నినాదాలు ఉచ్ఛ్వాస నిశ్వాసాలై ఈ జాతిజనులు పాడు కొనే మంత్రపాఠాలయ్యాయి. ప్రతి భారతీయునికి రోమాంచిత మయ్యేత్యాగగుణం-కంఠం గద్గదికమయ్యే స్వాతంత్ర్య రక్త కణం ఈ దేశదేహంలోకి నూతనశక్తిపుంజాన్ని ఇంజెక్ట్ చేసినదీ ఆగస్టు క్రాంతి!
ఇది భారతజాతి ఏకాత్మతా నినాదం!
ఇది భారత జనావళికి పరీక్షా సమయం!
ఇదిభారతస్వాతంత్ర్యసిద్ధికితిరుమంత్రమైన అమోఘఘట్టం!*

*ఆజాదీ కా అమృతోత్సవ్ సందర్భంగా మన దేశ స్వాతంత్ర్యసిద్ధికి కారణమైన మహానుభావులెందరో అందరికీ భక్తిపూర్వకంగా కృతజ్ఞతాంజలులు సమర్పించటం మనందరి కనీస కర్తవ్యం!*

*తు.చ.తప్పకుండా విధినిర్వహిస్తోంది...రాజమహేంద్రవర ఆదికవి నన్నయ విశ్వకళాపరిషత్తు!*

## సివిల్స్ కోచింగ్‌కు 21st సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీతో ఎంవోయు



**04.08.22 (మీడియాసెల్)** విశ్వవిద్యాలయం విద్యార్థులకు సివిల్స్ కోచింగ్ కు సంబంధించి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, 21st సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. గురువారం యూనివర్సిటీ సెమినార్ హాల్ లో 21 సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీతో ఎంవోయు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, 21 సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ పి.కృష్ణ ప్రదీప్ సమక్షంలో విశ్వవిద్యాలయంలో సివిల్ కోచింగ్ కు సంబంధించిన ఎంవోయు పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ 21 సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ వారు నన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థులకు సివిల్ సర్వీసెస్, గ్రూప్ 1, గ్రూప్ 2 నందు శిక్షణ ఇచ్చే విధంగా అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. త్వరలో గ్రూప్ 1 నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయ విద్యార్థులకు చక్కని అవకాశాన్ని కల్పించామన్నారు. విశ్వవిద్యాలయంలోని అన్ని కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అకడమిక్ ప్లానింగ్, సంక్షిప్త విశ్లేషణ మరియు ప్రణాళికబద్ధంగా కష్టబడితే సివిల్ సర్వీసెస్ సాధించడం సాధ్యమేనని అన్నారు. సైన్స్ మరియు ఇంజనీరింగ్ కోర్సుల విద్యార్థులు కూడా సివిల్ సర్వీసెస్ చేయవచ్చునని తెలిపారు. తరువాత వివిధ పోటీ పరీక్షలపై అవగాహన కల్పించేందుకు 21 సెంచరీ ఐ.ఎ.ఎస్ అకాడమి వారిచే సెమినార్ నిర్వహించబడింది, ముఖ్యంగా వినడం, మాట్లాడటం, చదవడం & రాయడం మరియు ABCD (ఆప్టిట్యూడ్, బెనివలెన్స్, కన్సిస్టెన్సీ & డెమోక్రసీ) సివిల్స్ & గ్రూపులు(1&2)పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దూరదర్శన్ మాజీ అడిషనల్ డైరెక్టర్ పద్మనాభరావు, రుడా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్ మరియు ఇటీవలి గ్రూప్-1 ర్యాంకర్ ధీరజ్ వినీల్ అభ్యర్థులకు తమ విలువైన సూచనలను అందించారు. కార్యక్రమంలో అతిథులు విశ్వవిద్యాలయ విద్యార్థుల సమక్షంలో కోచింగ్ సంస్థ యొక్క ఉచిత కరెంట్ అఫైర్స్ మాసపత్రికను ఆవిష్కరించి, వివిధ పోటీ పరీక్షలకు దాని ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో 21st సెంచరీ ఐఏఎస్ అకాడమి వైస్ చైర్‌పర్సన్ ధరణి.కె మరియు విద్యార్థి వ్యవహారాల డీన్ డా. ఎన్. ఉదయ్‌భాస్కర్, తెలుగుశాఖ అధ్యక్షులు డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జక్కంపూడికి నన్నయ నివాళి



**06.08.22 (మీడియాసెల్)** గోదావరి జిల్లాలకు ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ధృడ సంకల్పంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఏర్పాటుకు కృషి చేసిన మహనీయుడు దివంగతనేత, మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్ రావు చిర స్మరణీయుడని రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అన్నారు. విశ్వవిద్యాలయంలో శనివారం జక్కంపూడి రామ్మోహన్ రావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి హాజరై జక్కంపూడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ప్రతీ విశ్వవిద్యాలయం ఏర్పాటు వెనుక కొందరు మహనీయుల కృషి ఉంటుందని నన్నయ విశ్వవిద్యాలయం ఏర్పాటు వెనుక జక్కంపూడి రామ్మోహన్ రావు విశేషమైన కృషి చేసారని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉన్నంత కాలం జక్కంపూడి రామ్మోహన్ రావు పేరు నిలిచి ఉంటుందని తెలిపారు. ప్రజానాయకుడుగా జక్కంపూడి రామ్మోహన్ రావు ప్రజల పక్షాన నిలిచారని కొనియాడారు. జక్కంపూడి రామ్మోహన్ రావు కలలను సకారం చేస్తూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి సమష్టి కృషితో పని చేయాలని అదే జక్కంపూడికి నిజమైన నివాళి అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డి.జ్యోతిర్మయి, డా.వి.పెర్సిస్, డా.ఎం.గోపాలకృష్ణ మరియు ఆయా విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# గూడెం క్యాంపస్‌లో విజయవంతమైన ఒక రోజు సదస్సు



విద్యార్థులకు కావల్సిన నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు, నేటి పోటీ ప్రపంచంలో ఎలా ముందుకు ఎదగాలనే అంశాలపై 4న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, తాడేపల్లిగూడెం క్యాంపస్ లో సునీల (సైంటిస్ , ISRO) ముఖ్య అతిథిగా ఉపన్యసించారు. వీటితో పాటుగా ISROలో వున్న ఉద్యోగ అవకాశాలు, విద్యార్థులు పెంపొందించుకోవాల్సిన నైపుణ్యాలు, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారతదేశం ఎలా ముందంజలో ఉంది అనే విషయాలు సునీల వివరించారు. విశ్వవిద్యాలయానికి చెందిన ఎంబీఏ ఎమ్మెస్సీ ఫిజిక్స్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు అందరూ అత్యుత్సాహంగా పాల్గొని క్రొత్త విషయాలు తెలిసికొన్నారు. సదస్సు ద్వారా విద్యార్థుల యొక్క భవిష్యత్ దశా దిశా నిర్దేశానికి, అలాగే వారి తదుపరి విద్యావకాశాలకు ఎంతో దోహదం చేస్తుందని ప్రిన్సిపాల్ ఆచార్య కె. శ్రీ రమేష్ తెలిపారు. అన్ని డిపార్ట్‌మెంట్ కోర్స్ కోఆర్డినేటర్లు సునీలను సన్మానించారు.

## మంచిమాట

**ఎవరిలో స్వార్థపరత్వం ఇసుమంతకూడా ఉండదో అతడు అందరికన్నా గొప్పఆనందపరుడు.**

The happiest is the man who is not at all selfish.

– స్వామి వివేకానంద.



# గూడెం ఫార్మసీ వారి ఆజాది కా అమృత్ మహోత్సవం



ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి సూచనల మేరకు, భారత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, తాడేపల్లిగూడెం క్యాంపస్ ఫార్మసీ విభాగం వారు 75 ఆజాదీ కా అమృత్ మహెూస్తావ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిపార్ట్‌మెంట్ వారు హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్ నిర్వహించి 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవ వేడుక యొక్క ప్రాముఖ్యత విద్యార్థులకు తెలియచేసారు. హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్ బాగంగా ఫార్మసీ విద్యార్థులు జెండాతో సెల్ఫీ తీసుకుని, భౌగోళిక కోఆర్డినేట్‌ల ప్రకారం విజయవంతంగా వెబ్‌సైట్‌లో పోస్ట్ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఫార్మసీ విభాగం కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ హీరా బట్టు, అధ్యాపకులు డాక్టర్ సురేంద్ర బాబు, కె.నిత్యానందరెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా ప్రారంభించారు.

# కొండదొర భాషపై పరిశోధన


గంటాకిరణ్ బాబు

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐ సి ఎస్ ఎస్ ఆర్) న్యూఢిల్లీ వారి ద్వారా ఎంపిక కాబడి డా.గంటా కిరణ్ బాబు పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ స్కాలర్ గా "ఆంధ్రప్రదేశ్ లోని కొండదొర గిరిజన భాష యొక్క భాషాపరమైన విశ్లేషణ" అనే అంశంపై తన మార్గదర్శకంలో పరిశోధన చేస్తున్నారని రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అన్నారు. 2001వ సంవత్సరం జనాభా లెక్కల ప్రకారం కొండదొర గిరిజన తెగవారు 69 వేలమంది ఉండగా 2011 వ సంవత్సరం జనాభా లెక్కల ప్రకారం రెండు లక్షలకు పైగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నివసిస్తున్నారని చెప్పారు. కొండదొర తెగ వారికి లిపి లేనందున చాలా పరిశోధన జరగాల్సి ఉందని, ఈ భాషకు లిపి వర్ణమాల త్వరలో అందించడం కొరకు పరిశోధన జరుగుతుందని చెప్పారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ కు డా.గంటా కిరణ్ బాబు కృతజ్ఞతలు తెలిపారు.

# డిపార్ట్మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ ఫేర్వెల్ పార్టీ









# డిపార్ట్మెంట్ ఆఫ్ జియోసైన్సెస్















# డిపార్ట్మెంట్ ఆఫ్ బోటనీ




















ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in